



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 12-10-2024 సంపుటి : 06 సంచిక : 16 పేజీలు : 8 వెల : రూ 3-00


## యురేసియా, వెస్ట్ ఏషియాలో శాంతి స్థాపన జరగాలి: ప్రధాని మోదీ



లావోస్: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ, రాజకీయ సంక్షోభాల వల్ల.. దక్షిణాసియా దేశాలపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యురేసియా, వెస్ట్ ఏషియా దేశాల్లో శాంతి, స్థిరత్వం నెలకొనాలని ఆయన ఆశించారు. లావోస్‌లో జరుగుతున్న 19వ ఈస్ట్ ఏసియా సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. యుద్ధ క్షేత్రాల నుంచి సమస్యలకు పరిష్కారాలు దొరకవన్నారు. దక్షిణాసియా ప్రాంతంలో చైనా ప్రాబల్యాన్ని గురించి ప్రస్తావిస్తూ.. స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ విధానాల వల్ల ఈ ప్రాంతంలో శాంతి నెలకొంటుందన్నారు. దక్షిణ చైనా సముద్ర ంలో శాంతి, భద్రత, స్థిరత్వం వల్లే.. ఇండో పసిఫిక్ ప్రాంతంలో శాంతి ఉంటుందన్నారు. సముద్ర కార్యకలాపాలన్నీ యూఎన్సీ ఎల్వోఎస్ కు అనుగుణంగా జరగాలని ఆయన కోరారు. నావిగేషన్, ఎయిర్‌స్పేస్‌పై స్వేచ్ఛ ఉండాలన్నారు. ప్రాంతీయ దేశాల విదేశీ విధానాలపై ఆంక్షలు ఉండవద్దు అన్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, కానీ విస్తరణపై కాదన్నారు. యుద్ధాలు జరుగుతున్న దేశాల వల్ల .. గ్లోబల్ సౌత్ ప్రాంతంపై ప్రభావం పడుతోందన్నారు. బుద్ధుడి పుట్టిన దేశం నుంచి వచ్చానని, యుద్ధాలు చేసే యుగం ఇది కాదన్నారు.

## రెడ్‌బుక్‌కు జగన్ ఇన్‌స్పైర్ అయ్యారు

**వారు ఏ బుక్ పెట్టుకున్నా అభ్యంతరం లేదు**
**చట్టాలను ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవు**
**కియాతో అనంతలో నిరుద్యోగ సమస్య తీర్చగలిగాం**
**మీడియాతో మంత్రి నారా లోకేశ్**



అమరావతి,అక్టోబర్11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో రెడ్ బుక్ యాక్షన్ మొదలైందని, చట్టాన్ని ఉల్లంఘించి ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వాళ్లపై కఠిన చర్యలు ఉంటాయని, చట్టాన్ని ఉల్లంఘించిన బ్యాచ్‌కు రెడ్ బుక్‌లో తమ పేరు ఉందో లేదో అనే కంగారు ఉందని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. సాగు సాధ్యం కాని ప్రాంతంలోనూ కార్లు పరిగెత్తించిన ఘనత సీఎం చంద్రబాబుదని మంత్రి లోకేశ్ తెలిపారు. మంగళగిరి పరిధిలోని కియా కార్ల షోరూమ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇది ప్రారంభం మాత్రమేనని.. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు వస్తాయన్నారు. కరవు ప్రాంతం అనంత గడ్డ పైకి కియా రావడానికి చంద్రబాబు కారణమని చెప్పారు. యాక్షన్ అయితే అనివార్యమని, వైసీపీ వాళ్లు ఏ పుస్తకం పెట్టుకున్నారో వాళ్లకే స్పష్టత లేదని.. కానీ తన నుంచీ ఇన్స్పైర్ అయ్యారని అర్థమైందన్నారు. రాయలసీమ తయారీ రంగానికి, ఉత్తరాంధ్ర సేవా రంగానికి కేంద్రాలుగా మారనున్నాయని, పరిపాలన ఒకే దగ్గర ఉండాలి, అభివృద్ధి వికేంద్రీకరణ అన్ని ప్రాంతాలకు జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఇప్పుడిప్పుడే పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని, బ్లూ బ్యాచ్ ఆగడాల వల్ల పరిశ్రమల స్థాపనకు ఇబ్బంది అనిపిస్తే ఎంతమాత్రం ఉపేక్షించమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. వరదలొస్తే జగన్‌లా పరదాలు కట్టుకునట్లు.. సీఎం చంద్రబాబు అండ్ టీమ్ ఇంట్లో కూర్చోలేదన్నారు. మాజీ సీఎం జగన్‌కు ఆత్మలతో మాట్లాడే అలవాటు ఇంకా పోనట్లుందని ఎద్దేవా చేశారు. గతంలో ఇలానే ఆత్మలతో మాట్లాడి కియా తమ ఘనతే అన్నారని, ఇప్పుడు టీసీఎస్ గురించి ఏ ఆత్మతో మాట్లాడారని ప్రశ్నించారు. జగన్ హయాంలో తరిమేసిన పరిశ్రమలన్నీ మళ్లీ తెస్తున్నామని.. ఇందుకు లూలూ, అశోక్ లైల్యాండ్ లే ఉదాహరణ అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ఇటీవల ముంబైలో టాటా సన్స్ బోర్డు చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ తో సమావేశం అయ్యారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### జిల్లా మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 11-చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి, ఎంపీ శబరి. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా లు జాయింట్ కలెక్టర్ సి. విష్ణు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మల గన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, చాలా పెద్దమ్మ దుర్గమ్మతల్లి ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించడంతో పాటు నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని వారు ఆ ప్రకటలో ఆకాంక్షించారు.

## భారీ వర్షాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి--జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 11-బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా ఈ నెల 13 నుంచి జిల్లాలో భారీ వర్షాలుకురిసే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని ఆమె సూచించారు. గ్రామాల్లో ఉన్న మట్టి మిద్దెలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## పత్రికల కొనుగోళ్లు..ప్రకటనల్లో భారీ అవినీతి

**అన్నింటిపైనా విచారణ చేయిస్తున్నాం**
**కొత్త ఛాంబర్‌లోకి ప్రవేశించిన మంత్రి పార్థసారథి**



అమరావతి,అక్టోబర్11 గత ప్రభుత్వ హయాంలో పత్రికల కొనుగోళ్లు, ప్రకటనల విషయంలో అవతవకలు జరిగాయని, నిధులు అక్రమంగా మళ్లాయని సమాచార,, గృహనిర్మాణ శాఖమంత్రి మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శుక్రవారం మంచి రోజు కావడంతో ఆయన తన పేషీలోకి ప్రవేశించారు.గత వైసీపీ ప్రభుత్వం అవినీతిలో విప్లవం సృష్టించిందని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. అత్తారింటికి దారేది తరహాలో రాష్ట్రంలోని సంపద అంతా తన ఇంటికి వచ్చేలా గత పాలకులు ప్రణాళికలు రచించుకున్నారని ఎద్దేవా చేశారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ మొదటి అంతస్తులోని తన కార్యాలయంలో శుక్రవారం నాడు మంత్రి పార్థసారథి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తన చాంబర్ పనులు పూర్తికాకపోవడంతో తాత్కాలిక చాంబర్‌లో విధులు నిర్వహించారు. తాజాగా చాంబర్ పనులు పూర్తవ్వడంతో ఇవాళ కొత్త చాంబర్‌లోకి మారారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పరిపాలనలో చేసిన తప్పులను ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు చక్కదిద్దుతున్నారని తెలిపారు.జగన్ ప్రభుత్వ హయంలో ఐ అండ్ పిఆర్ శాఖ, అడ్వర్టయిజ్‌మెంట్ విషయంలో అవలంబించిన విధానాన్ని మంత్రి తప్పుపట్టారు. గత ప్రభుత్వ హయంలో 200 రూపాయలు ఓ పత్రిక కొనుగోలు చేయాలని ఇచ్చారని.. దానిపై విచారణ జరుగుతోందన్నారు. అది కూడా ఫలానా పత్రిక కొనాలని అనధికారి కంగా నిర్దేశిరచారనే సమాచారం ఉందన్నారు. అందుకే ముందుగా 200 రూపాయలు ఇచ్చే జీవోను రద్దు చేశామని వెల్లడించారు. కొన్ని పత్రికలకు అర్హత లేకపోయినా కోట్ల రూపాయలు ప్రకటనలు ఇచ్చారని, ఇంకొన్ని పత్రికలు న్యూట్రల్‌గా ఉన్నా యాడ్స్ ఇచ్చి పేమెంట్ చేయలేదని.. చివరకు వారే వెనెక్కి తగ్గేలా నీచమయిన పద్దతిని అవలంబించారని మంత్రి కొలుసు మండిపడ్డారు. తనకు మంత్రిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుకు, లోకేష్‌కు, డిప్యూటీ సిఎం పవన కళ్యాణ్, ప్రధాని మోదీకి మంత్రి కొలుసు పార్ధ సారధి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు జిల్లా స్థాయి లోనే జరపండి.. - ఆప్టా



విభారె న్యూస్ అక్టోబర్ 11 కర్నూలు జిల్లా ప్రతినిధి..ఈ దసరా సెలవలు ముగిసిన తరువాత మన రాష్ట్రం లో ప్రాథమిక స్థాయిలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు విద్యాబోధన లో మెలుకువలు పెంపొందించే ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ ఎల్ ఎన్) వృత్యంతర శిక్షణా తరగతులను రెండు లేదా మూడు జిల్లాలకు కలిపి ఒక చోట సుమారు 6 రోజుల పాటు రెసిడెన్షియల్ తరగతులు నిర్వహించుటకు ప్రభుత్వం వారు షెడ్యూల్ ఇచ్చి యున్నారు. దీని వల్ల చాలామంది మహిళా ఉపాధ్యాయిని లకు మరియు 55 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకు (ఆరోగ్య సమస్యలు) ఎంతో ఇబ్బంది, వ్యయ ప్రయాసలు ఎదుర్కోవలసి ఉంటుంది కావున చాలా మంది మహిళా ఉపాధ్యాయిని లను మరియు సీనియర్ ఉపాధ్యాయులను దృష్టిలో ఉంచుకొని ఈ ఎఫ్ ఎల్ ఎన్ శిక్షణా తరగతులను అన్ని జిల్లా ల జిల్లా కేంద్రాలలో లేదా డివిజన్ స్థాయిలో నిర్వహించాలని ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ పక్షాన సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ని వ్రాత పూర్వకంగా లేఖ ద్వారా ప్రాతినిథ్యం చేయటం జరిగింది.కావున వారు ఈ విషయం లో తగు చర్యలు తీసుకోవాలి.


## ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఆయుధ పూజ



విభారె న్యూస్ అక్టోబర్ 11 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ నందు దుర్గాష్టమి సందర్భంగా సీఐ చిరంజీవి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఆయుధ పూజ కార్యక్రమంలో భాగంగా అర్చకులు స్థానిక పోలీస్ స్టేషన్ లో పూజలు నిర్వహించి, ఆయుధపూజను సాంప్రదాయం ప్రకారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎస్సై నగినా , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాత...

విభారె న్యూస్ అక్టోబర్ 11 ఎమ్మిగనూరు. దసరా దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని 9వ రోజు అయిన శుక్రవారం రోజు వాసవి మాత ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలంకరణకు 25 లక్షల రూపాయలతో ధనలక్ష్మి అలంకరణను గావించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులై ప్రసాదాన్ని స్వీకరించారు



# సంపాదకీయం

శనివారం 12-10-2024

## పండగల్లో దసరాకు విశిష్ట స్థానం !

దసరా హిందువుల ముఖ్యమైన పండుగ. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులు పదవరోజు విజయ దశమి కలసి దసరా అంటారు. ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు ప్రాధాన్యత ఇచ్చే పండుగ. ఈ పండుగను నవరాత్రి, శరన్నవరాత్రి అని అంటారు. శరదృతువు ఆరంభంలో వచ్చే పండుగ కనుక ఈ పేరు వచ్చింది. కొందరు ఈ పండుగకు మొదటి మూడు రోజులు పార్వతిదేవికి, తరువాతి మూడు రోజుల లక్ష్మీ దేవికి, తరువాత మూడురోజులు సరస్వతి దేవికి పూజలు నిర్వహిస్తారు. ముఖ్యముగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భమున రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం రివాజు. జగన్మాత అయిన దుర్గాదేవి, మహిషాసురుడనే రాక్షసునితో 9 రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి జయాన్ని పొందిన సందర్భమున 10వ రోజు ప్రజలంతా సంతోషంతో పండగ జరుపుకున్నారు. అదే విజయదశమి.హిందువులు జరుపుకునే పండగలలో దసరా పండగకు విశిష్ట స్థానం ఉంది. ఆశ్వయుజ మాసం శుక్లపక్షంలో మొదటి తొమ్మిది రోజులను దసరా నవరాత్రులు, దేవీ నవరాత్రులు లేక శరన్నవరాత్రులు అని అంటారు. ఈ దసరా ఉత్సవాన్ని నవరాత్రులుగా తొమ్మిది రోజులు పాటు జరుపుకుని.. 10వ రోజున దసరా లేదా విజయదశమిగా జరుపుకుంటారు. ఈ తొమ్మిది రోజులు శక్తిస్వరూపిణి అయిన దుర్గాదేవి అవతారాలను అంటే నవదుర్గలను అత్యంత భక్తీ శ్రద్దలతో పూజిస్తారు. ఈ దేవీ నవరాత్రులలో చివరి మూడు రోజులు, దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమిగా జరుపుకుంటూ విద్యార్ధులు పుస్తకాలూ, పెన్నులను పూజిస్తే, శ్రామికులు తమ పనిముట్లను పూజిస్తారు. ఇక క్షత్రియులు ఆయుధ పూజ చేసి.. అమ్మవారి కృపకు పాత్రులవుతారు. దుర్గాదేవి మహిషాసురమర్దనిగా అవతరించి రాక్షసుని మీదకు దండెత్తి విజయం సాధించింది. అంతేకాదు రాముడు రావణ సంహారం చేసింది దసరనే.. కనుక పూర్వం రాజులు తమ దండయాత్రకు దసరా పండగానే శుభ ముహార్తంగా ఎంచుకునే వారని తెలుస్తోంది. దేవీ పూజ ప్రాధాన్యత ఈశాన్య భారతదేశంలో హెచ్చుగా ఉంటుంది. దైత్యవంశానికి ఆశాదీపంలా జన్మించిన 'మహిషాసురుడు' తన ఆంతరంగిక మిత్రులతో, సచివులతో సమాలోచన చేసి, మరణంలేని జీవనం కోసం మేరుపర్వతశిఖరం చేరి బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపస్సు ప్రారంభించాడు. కాలం కదలికలో అనేక వేల సంవత్సరాలు కదిలి వెళ్లిపోయాయి. మహిషాసురుని అచంచల తపస్సుకు సంతసించిన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై, 'మహిషాసురా.., ఇంక తపస్సు చాలించి ఏ వరం కావాలో కోరుకో' అన్నాడు.'పితామహా.,నేను అమరుణ్ణి కావాలి. నాకు మరణం లేని జీవితాన్ని ప్రసాదించు' అని కోరాడు మహిషాసురుడు. అప్పుడు బ్రహ్మదేవుడు 'మహిషాసురా..పుట్టిన ప్రాణి గిట్టక తప్పదు.., గిట్టిన ప్రాణి మరల పుట్టక తప్పదు. జననమరణాలు సకలప్రాణికోటికి సహజ ధర్మాలు. మహాసముద్రాలకూ, మహాపర్వతాలకూ కూడా ఏదో ఒక సమయంలో వినాశం తప్పదు. ప్రకృతివిరుద్ధమైన నీ కోరిక తీర్చుట అసంభవం. కనుక,నీ మరణానికి మృత్యువుకు ఒక మార్గం విడిచిపెట్టి, మరే వరమైనా కోరుకో' అన్నాడు. అప్పుడు మహిషా సురుడు 'విధాతా..అల్పమైన కోరికలకు ఈ మహిషాసురుడు ఆశపడడు. సరే.. ఆడది నా దృష్టిలో అబల..ఆమెవల్ల నాకే ప్రమాదమూ రాదు. కనుక.,పురుషుడి చేతిలో నాకు మరణం రాకుండా వరం అనుగ్రహించు' అని కోరాడు. బ్రహ్మదేవుడు ఆ వరాన్ని మహిషాసురునికి అనుగ్రహించి అంతర్ధాన మయ్యాడు. బ్రహ్మదేవుని వరాల వలన వరగర్వితు డైన మహిషాసురుడు దేవతలతో ఘోరమైన యుద్ధము చేసి వారిని ఓడించి ఇంద్రపదవి చేపట్టాడు. దేవేంద్రుడు త్రిమూర్తులతో మొర పెట్టుకొనగా మహిషునిపై వారిలో రగిలిన క్రోధాగ్ని ప్రకాశవంతమైన తేజముగా మారింది. త్రిమూర్తుల తేజము కేంద్రీకృతమై ఒక స్త్రీరూపమై జన్మించింది. శివుని తేజము ముఖముగా, విష్ణు తేజము బాహువులుగా, బ్రహ్మ తేజము పాదములుగా కలిగి మంగళమూర్తిగా అవతరించిన ఆమె 18 బాహువులను కలిగి ఉంది. ఆమెకు శివుడు శూలమును, విష్ణువు చక్రమును, ఇంద్రుడు వజ్రాయుధమును, వరుణ దేవుడు పాశము, బ్రహ్మదేవుడు అక్షమాల, కమండలము హిమవంతుడు సింహమును వాహనంగాను ఇచ్చారు. ఇలా సర్వదేవతల ఆయుధములు సమకూర్చుకొని మహిషాసురుని సైన్యంతో తలపడి భీకరమైన పోరు సల్పింది. మహిషా సురుని తరఫున పోరు సల్పుతున్న ఉదగ్రుడు, మహాహనుడు, అసిలోముడు, బాష్కలుడు, బిడాలుడు మొదలైన వారిని సంహరించిన తరువాత మహిషాసురునితో అమ్మ తలపడినది. ఈ యుద్ధములో ఆదేవి వాహనమైన సింహమూ శత్రువులను చీల్చి చెండాడింది. దేవితో తలపడిన అసురుడు మహిషి రూపము, సింహరూపము, మానవరూపముతో భీకరముగా పోరి చివరకు తిరిగి మహిషిరూపములో దేవిచేతిలో హతుడైనాడు.ఈ విధంగా అప్పటి నుండి మహిషుని సంహరించిన దినము కాబట్టి మహిషాసుర మర్ధనిని కొలిచే దసరా పర్వదినంగా ప్రజలచే కొనియాడబడింది. ఉత్తరభారతంలో దసరాను రావణ దహనంగా నిర్వహిస్తారు. దక్షిణాన శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపుగా నిర్వహిస్తారు. ఇలా ఒక్కోచోట ఒక్కో విధంగా అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది.

# ప్రతి బాలిక తప్పకుండా చదువుకోవాలి


**ఆడపిల్లల్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత**
**బాల్య వివాహాలు చేసుకోకండి**
**చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి**
**జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా**





విభారే న్యూస్.కర్నూలు ప్రతినిధి. అక్టోబర్ 11:- సమాజంలో ప్రతి బాలిక చదువుకోవాలని, ఆడపిల్లల్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా పిలుపునిచ్చారు..శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సమగ్ర మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యం లో నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో బేటి పడావో అనే కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో అమలు చేస్తోందని తెలిపారు..ఆడపిల్లలను రక్షించుకోవాలని, మంచి చదువులు చదివించాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. మాతృ గర్భం నుంచి ఆడపిల్లలకు రక్షణ లేని పరిస్థితి నుంచీ ప్రతి దశలో వారిని కాపాడుకుంటూ, చదువుతో మంచి భవిష్యత్తును అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.. సమాజంలో నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనేక మంది మహిళలు ఉన్నత పదవుల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాగే మన దేశ రాష్ట్రపతి ఒక మహిళ కావడం గర్వకారణమని కలెక్టర్ తెలిపారు.. అయితే ఇప్పటికీ మారుమూల ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో ఆడపిల్ల పట్ల కొంత వివక్ష ఉందని, అందువల్లనే బేటి బచావో బేటి పడావో పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు.. శిశు గృహ, బాలసదన్, మిషన్ వాత్సల్య వంటి పథకాల ద్వారా తల్లిదండ్రులు లేని పిల్లలకు, అనాథ పిల్లలను సంరక్షించడంతోపాటు వారికి విద్యను అందించే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని కలెక్టర్ వివరించారు..ఆడపిల్లల్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ఆడపిల్లలు ఎవరైనా ఆపదలో ఉంటే 1098 కి ఫోన్ చేస్తే సహాయం అందుతుందన్నారు..అలాగే మహిళలు ఆపదలో ఉంటే 181 కు, పోలీసుల సహాయం కోసం 100 కు, జిల్లా బాలల మరియు మహిళల రక్షణాధికారి 9440814461 కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని కలెక్టర్ పేర్కొన్నారు..ఆడపిల్లలు ఏ విధంగా రక్షణ లేకపోయినా ఈ నంబర్లకు ఫోన్ చేసి సహాయాన్ని పొందాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఈ ఫోన్ నంబర్లను అందరికీ తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..అలాగే బాలికలు మహిళలు చట్టాల పట్ల పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. పిసిఎన్డిటి, బాల్యవివాహాల నిరోధక చట్టాలు ఎన్నో ఉన్నాయని, వీటి గురించి తెలుసుకుని వారి హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు..గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసి, లింగ్ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేయడం, బాల్య వివాహాలు చేయడం నేరం అని, వీటికి చట్టాలు, శిక్షలు ఉన్నాయని, వీటి గురించి తెలుసుకోవాలని కలెక్టర్ వివరించారు.. బాల్య వివాహాల వల్ల చిన్న వయసులోనే తల్లి కావడం వల్ల తల్లీ, బిడ్డ లకు ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు.. అందువల్ల బాలికలు బాల్య వివాహాలు చేసుకోవద్దని, బాగా చదువుకుని అన్ని విధాలా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ సూచించారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం ఉందన్నారు..బాలికలు విద్య పై దృష్టి పెట్టి, అభివృద్ధిని సాధించేందుకు పోటీ తత్వంతో ముందడుగు వేయాలని సూచించారు.. ప్రస్తుత సమాజంలో మహిళలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని సామాజికంగా,ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధిని సాధించాలని సూచించారు.. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండి తమకు తాము రక్షణ పొందాలని జేసీ సూచించారు.ఐసిడిఎస్ పిడి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ఈరోజు అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.. న్నారు. బాలికల సంరక్షణకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస ఆచారి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

## సరసమైన ధరలకు ప్రత్యేక కౌంటర్లు :జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి 11-రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యాసర వస్తువులు సరసమైన ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం శ్రీనివాస్ సెంటర్ సమీపంలోని రైతు బజార్ లో పౌర సరఫరాల శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక విక్రయ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ప్రారంభించి వినియోగదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ నూనెలు అధిక ధరలు వున్న నేపథ్యంలో నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులతో మాట్లాడి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల పట్టణం శ్రీనివాస నగర్ లోని రైతు బాజార్, టేక్కే మార్కెట్ యార్డ్ లో ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి వినియోగదా రులకు అందిస్తున్నామన్నారు. అలాగే ఆత్మకూరులో రెండు కేంద్రాలు, నందికోట్కూరు, బనగానపల్లి మండల కేంద్రాల లోను ప్రత్యేక విక్రయ కేంద్రా లను ఏర్పాటు చేసామన్నారు. సన్‌ఫ్లవర్ (లీటరు)124/- రూపాయలు, పామ్ ఆయిల్ (లీటరు)110/-చొప్పున రూపా యలు చొప్పున ప్రత్యేక కౌంట ర్లలో విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ వివరించారు.అలాగే అన్ని రైతు బజార్లలో టమాట కేజీ రూ.40/-లకు, ఉల్లిగడ్డ కేజీ రు.35/-ల చొప్పున వినియోగదారులకు విక్రయిస్తామని జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ రావు. రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## మహానందిలో సి ఐ డి డైరెక్టర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 11-మహానంది పుణ్యక్షేత్రంలో సి ఐ డి డైరెక్టర్ నగేష్ దంపతులు పూజలు నిర్వహించారు. శుక్రవారం శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్ల కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆనవాయితీ ప్రకారం యాగశాలలో అర్చకులు కండువాకప్పి స్వామివార్ల ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. ఆయన వెంట సి ఐ డి ఎస్ ఐ భరత్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ సుధీర్,రామిరెడ్డిలు వున్నారు.

## శ్రీ నరసింహ ఈరన్న స్వామి రాజగోపుర నిర్మాణానికి భక్తుల విరాళం..



విభారె న్యూస్ అక్టోబర్ 11 కౌతాళం.. శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన రాజగోపుర నిర్మాణనికి ?.26000/- శాశ్వత అన్నదానంనికి ? 50,000/- అనంతపురం వాస్తవ్యులైన సర్వశెట్టి సాయి సాత్విక, వారి కుటుంబ సభ్యులుతో ఈ విరాళాన్ని చెల్లించి యున్నారు. అధికారులు దాతలకు శ్రీ స్వామి దర్శనం, స్వామివారి శేష వస్త్రాము, లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ విజయ్ కుమార్,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.


## రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ ను నియమించండి

### రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ కన్వీనర్ జయ భారత్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి : రాష్ట్రంలో రెడ్డి సామాజికవర్గం సంక్షేమం కోసం రెడ్డి కార్పోరేషన్ చైర్మన్ ను నియమించి నిధులు కేటాయించాలని రెడ్డి కమ్యూనిటీడెవలప్మెంట్ సొసైటీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ ఇడమ కంటి జయ భారత్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. రాష్ట్రంలో 70 లక్షలకుపైగా ఉన్న రెడ్డి సామాజికవర్గంలో 80 శాతం మంది పేద, మధ్యతరగతి వారే ఉన్నారన్నారు. రెడ్డి రైతులకు సబ్సిడీలో ట్రాక్టర్లు మరియు వ్యవసాయ యంత్రాలు,వ్యవసాయ పరికరాలు తదితర వాటిని ఇవ్వాలన్నారు. స్వయం ఉపాధి సహాయక రంగాలలోచేయూత, రెడ్లకు రక్షణ నిధి ఏర్పాటు చేయాలనిప్రమాదవశాత్తు రెడ్డి రైతు మరణిస్తే రూ.10 లక్షలుఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. విదేశీ విద్యకు వెళ్లేపేద, మధ్య తరగతి రెడ్డి విద్యార్థులకు రూ.20లక్షలు విదేశీ విద్యానిధి ఇవ్వాలన్నారు.

## మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనం ఇచ్చిన పార్వతీ మాత..



విభారె న్యూస్ అక్టోబర్ 11 ఎమ్మిగనూరు.శ్రీ నీలకంటేశ్వర స్వామి దేవస్థానము నందు శుక్రవారం శ్రీ పార్వతీ దేవి అమ్మవారు శ్రీ మహిషాసురమర్ధిని అమ్మవారు గా భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. భక్తులు దర్శించుకోవడానికి సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల భక్తులకు దర్శనం ఇచ్చారు.రాత్రి 9 గంటలకు నక్షత్ర హారతి సేవ జరిగినది.

## సొంత జిల్లాలో వైసీపీకి నేతల కరువు

కడప, అక్టోబరు 11, దప జిల్లా అంటేనే వైసీపీ అధినేత సొంత జిల్లా. దాని పేరే వైఎస్సార్ కడప జిల్లాలో అలాంటి కడప జిల్లాలో వైసీపీ ఆపసోపాలు పడుతుంది. సరైన నాయకత్వం జిల్లాలో కొరవడింది. దీంతో అధికారం కోల్పోయిన తర్వాత వైఎస్ కుటుంబానికి ఆ జిల్లా దూరమవుతున్నట్లే కనపడుతుంది. నాయకత్వ లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అధికారం ఉన్నప్పుడు అందరూ నాయకులే. కానీ రాష్ట్రంలో అధికారం లేనప్పుడు మాత్రం ఎవరూ పార్టీని పట్టించుకోవడం లేదు. పార్టీకి పెద్ద దిక్కు అనేది లేకుండా పోయింది. దీంతో వైసీపీ క్యాడర్ కకావికలమవుతుంది. ఉన్న ద్వితీయ శ్రేణి నేతలు కూడా పార్టీని వీడి వెళ్లిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.గత అసెంబ్లీ ఎన్నికల్లోనే కడప జిల్లాలో వైసీపీ దారుణమైన ఫలితాలను చూసింది. 2019 ఎన్నికల్లో పది స్థానాలకు గాను పదింటిని గెలుచుకున్న వైసీపీ 2024 ఎన్నికల్లో మాత్రం మూడు స్థానా?లకే పరిమితమయింది. ఇది చాలదూ వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలో వైసీపీ పతనమయిందనడానికి ఉదాహరణ. తర్వాత జడ్.పి. ఛైర్మన్ పదవి పోకుండా ఎలాగోలా కాపాడుకోగలిగారు. అదీ వైఎస్ జగన్ ఇన్ వాల్వ్ అయి వారితో సమావేశమయి కొంత భరోసా ఇవ్వడంతో జడ్పీ చైర్మన్ పదవి కోల్పోలేదు. అన్ని నియోజకవర్గాల్లో బలమైన నేతలున్నారు. ఇప్పుడు సిట్టింగ్ పార్లమెంటు సభ్యుడిగా వైఎస్ అవినాష్ రెడ్డి ఉన్నారు. అయినా ఎవరూ పార్టీని పట్టించుకోవడం లేదునియోజకవర్గంలో నేతలు పట్టించుకోక పోవడంతో పార్టీని వదలి ద్వితీయ శ్రేణి నేతలు వదలి వెళ్లిపోతున్నారు. టీడీపీ క్షేత్రస్థాయిలో బలం పుంజుకునే దిశగా అడుగులు వేస్తుంది. జగన్ కూడా బెంగళూరు – తాడేపల్లి మధ్య చక్కర్లు కొడుతుండటంతో ఇక నేతలు కూడా పట్టించుకోవడంలేదు. జమ్మలమడుగు వంటి పట్టున్న నియోజకవర్గంలోనూ పూర్తిగా పార్టీని ఇన్ ఛార్జి సుధీర్ రెడ్డి వదిలేశారు. అయన నియోజకవర్గానికి దూరంగా ఉన్నారు. దీంతో అక్కడ క్యాడర్ కూడా అయోమయంలోనే ఉంది. అక్కడ రామసుబ్బారెడ్డికి పార్టీ బాధ్యతలను అప్పగించాలని వైసీపీ అధినాయకత్వం భావిస్తుంది. అయితే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదుఇక కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీ నుంచి వెళ్లిపోయారు. టీడీపీ ఖాతాలోకి కమలాపురం మున్సిపాలిటీ దాదాపుగా వెళ్లిపోయింది. ఛైర్మన్ తో పాటు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. జగన్ మేనమామ కమలాపురం నియోజకవర్గానికి మొన్నటివరకూ ప్రాతినిధ్యం వహించారు. వైసీపీ బలం ఎనిమిదికి పడిపోవడంతో అక్కడ వైసీపీ వీక్ అయింది. కౌన్సిలర్లు వెళ్లిపోతున్నా అక్కడ పట్టించుకునేందుకు ఎవరూ లేరు. ఏ నేత ప్రయత్నించకపోవడం పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. ఇలా కడప జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో అదే పరిస్థితి నెలకొంది. మరి జగన్ రంగంలోకి దిగుతారా? లేదా? అన్నది చూడాలి.

## కొత్త సిలబస్ తోనే టెన్త్ పరీక్షలు

గుంటూరు, అక్టోబరు 11, రాష్ట్రంలో గత మూడేళ్ల విద్యార్థులకు పాత సిలబస్‌తోనే పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు కొత్త సిలబస్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వెబ్‌సైట్‌లో ప్రశ్నాపత్రాలు, మోడల్ పేపర్లు, మార్కుల వెయిటేజీ వంటి అప్‌లోడ్ చేశారు.పదో తరగతి 2021-22, 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో పదో తరగతి చదివి ఫెయిల్ అయిన విద్యార్థులకు పాత సిలబస్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఎగ్జామినేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. ఆ మూడు సంవత్సరాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి ఫెయిల్ అయిన విద్యార్థులు, ఈ ఏడాది ఫెయిల్ అయిన సబ్జెట్ల రాయలనుకుంటే వారు పాత సిలబస్ ప్రకారమే రాయడానికి అవకాశం ఉంది. ప్రైవేట్, రీ ఎన్‌రోల్ చేసుకున్న విద్యార్థులు, ఆయా సంవత్సరాల్లో ఏ సిలబస్ ప్రకారం అయితే పరీక్షలు రాశారో, ఈ ఏడాది పబ్లిక్ పరీక్షల్లో కూడా వారికి పాత సిలబస్ వర్తిస్తుంది.ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25) పదో తరగతి విద్యార్థులకు మాత్రం మారిన కొత్త సిలబస్ ప్రకారం పబ్లిక్ పరీక్షలు ఉంటాయి. అందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, బ్లూ ప్రింట్, ఏడు పేపర్లకు సంబంధించి ప్రశ్నల వారీగా మార్కుల వెయిటేజీ, మోడల్ పేపర్లను పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ లో ఉంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2024-25 పదో తరగతి విద్యార్థులకు కొత్త సిలబస్ ప్రకారమే పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి హిందీ పేపర్‌పై సమీక్షించి, సవరణ చేశారు. ఈ సవరణ చేసిన హిందీ పేపర్‌ను కూడా వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేశారు.సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ప్రముఖ ప్రైవేట్ శిక్షణా సంస్థల నుండిచ ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లను ఆహ్వానించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించి ఈ టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే సాంఘిక్ష సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బు కొఠారి తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి ఉన్న శిక్షణా సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే సంస్థలు గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలనే నిబంధన ఉంది. అలాగే ఆ సంస్థ ద్వారా వంద మందికి పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారు ఉండాలి. మూడేళ్ల టర్నోవర్ సరాసరి రూ.40 లక్షలు ఉండాలి. ఆసక్తి ఉన్న డీఎస్సీ శిక్షణా సంస్థలు ఈనెల 21వ తేదీలోపు ఆన్‌లైనల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునేందుకు అందుబాటులో వెబ్‌సైట్ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మందికి ఈ ఉచిత డీఎస్సీ శిక్షణ ఇస్తారు. రెసిడెన్షియల్ విధానంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీలో అత్యున్నత శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### ఏపీకి తుఫాను ముప్పు.. మూడు రోజులు భారీ వర్షాలు

అమరావతి,రాష్ట్రానికి మరో తుఫాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఏపీని వర్షాలు వణికిస్తున్నాయి. వరుస తుపానుల ప్రభావంతో ఇటీవల వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయంకాగా.. నదులు, వాంగులువంకలు పొంగిపొర్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు, వరదల కారణంగా పలువురు మృత్యువాత పడ్డారు. పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆ నష్టాల నుంచి తేరుకోకముందే మరోసారి ఏపీలో భారీ వర్షాలు కురవబోతున్నాయి.దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 16 వరకు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం రెండు, మూడు రోజుల్లో వాయుగుండంగా బలపడుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# ఔట్ డోర్ ప్రోగ్రాంలు వద్దు.. సోషల్ మీడియా ముద్దు..

నెల్లూరు, అక్టోబరు 11, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు సోషల్ మీడియా ఎప్పుడో వేదికై పోయింది.ఏపీ రాజకీయాల్లో పొలిటికల్ కన్సల్టెంట్ల ప్రయేయం మొదలయ్యాక అధికారాన్ని చేరుకోడానికి, అధికారాన్ని నిలబెట్టుకోడానికి సోషల్ మీడియానే వేదికగా మారింది. ముసుగు ముఖాలతో సోషల్ మీడియాలో చేసే ప్రచారమే పార్టీలకు ఊపిరి పోస్తోంది. అన్ని పార్టీలు కొన్నేళ్లుగా ఇదే పంథాలో పయనిస్తున్నాయి.ఈ క్రమంలో సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న వైసీపీ వేగంగా తేరుకున్నట్టు కనిపిస్తోంది. నెలన్నర లోపే వైసీపీ సోషల్ మీడియా ఖాతాలను ఆ పార్టీ యాక్టివేట్ చేసుకుంది. మొదట్లో కొన్నాళ్లు తాడేపల్లిలోని జగన్ నివాసం సమీపంలోని విల్లాల్లో ఆ పార్టీ సోషల్ మీడియా కార్యకలాపాలను నిర్వహించారు. పోలీస్ కేసులు, సాంకేతిక కారణాలతో మరో ప్రాంతానికి తమ బృందాలను ఆ పార్టీ తరలించేసింది.అధికారానికి దూరమైన తర్వాత వైసీపీ అధ్యక్షుడు తరచూ బెంగుళూరు వెళ్లిపోతున్నా పార్టీ శ్రేణులకు, గతంతో పోలిస్తే వీలైనంత ఎక్కువగానే అందుబాటులో ఉంటున్నారు. మొదట్లో పార్టీ కార్యకర్తల ఆందోళనలు, నిరసన స్వరాలు వినిపించడంతో కార్యకర్తలతో కలవడానికి కూడా ఆ పార్టీ అధినేత విముఖత చూపించారు. పార్టీ శ్రేణుల్ని కలిసే కార్యక్రమాలకు స్వస్తి పలికారు. ?ఆ తర్వాత అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నారు.వైసీపీ ముఖ్య నేతల వ్యవహార శైలిపై ఆ పార్టీ నేతలు, కార్యకర్తల్లో అసంతృప్తి ఉన్నా, సోషల్ మీడియాలోనే ఎక్కువగా రీచ్ వస్తుందని ఆ పార్టీ బాధ్యులు అభిప్రాయపడుతున్నారు. బహిరంగ కార్యక్రమాలు చేపడితే నేతలు సొంతంగా ఖర్చు పెట్టాల్సి వస్తుందనే ఆందోళన కూడా మరో కారణమని చెబుతున్నారు.వినుకొండలో జరిగిన వైసీపీ సానుభూతిపరుడు రషీద్ హత్య, జైల్లో నందిగం సురేష్ పరామర్శ, వరద బాధితులు, వైసీపీ ముఖ్యనాయకులకు అనారోగ్యం నేపథ్యంలో పరామర్శ వంటి కార్యక్రమాలను జగన్ నిర్వహించారు. ఈ క్రమంలో గత నెలలో వచ్చిన వరద సహాయక చర్యల్లో అధికార పార్టీ విఫలమైందని విస్తృత ప్రచారం చేసింది.వరద బాధితులకు సహాయక చర్యలు, నష్టపరిహారం చెల్లింపు విషయంలో క్షేత్ర స్థాయిలో పోరాటాలు సీపీఎం చేస్తే సోషల్ మీడియా వాటిని ప్రచారాస్త్రాలుగా వైసీపీ మార్చుకుంది. బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో జరిగిన లోపాలను గణాంకాలతో సీపీఎం నాయకులు ఎండగట్టారు. సీపీఎం ఆందోళన నేపథ్యంలోనే ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ విడుదల చేసిన వివరాలతో వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో చెలరేగిపోయారు.మొదట్లో వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని కూటమి ప్రభుత్వం భావించింది. చివరకు బాధితులకు చెల్లించిన నష్టపరిహారం కంటే వరద సహాయక చర్యల పేరిట చేసిన ఖర్చు ఎక్కువ ఉందని జనంలోకి బలంగా వెళ్లడంతో ప్రభుత్వం చేసిన సాయం మొత్తం కొట్టుకుపోయింది. చివరకు మంత్రులు అంతా క్యూ కట్టి వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.మరోవైపు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విషయంలో ప్రతిపక్షానికి ఉండే అవకాశాలను వైసీపీ అందిపుచ్చుకుంటోంది.

అదే సమయంలో క్షేత్ర స్థాయిలో మాత్రం వైసీపీ తాజా మాజీ నాయకుల ఉనికి ఎక్కడా కనిపించడం లేదు. నిన్న మొన్నటి వరకు అధికారాన్ని ఎంజాయ్ చేసిన నేతలంతా పవర్ పోగానే ఎక్కడి వారు అక్కడ సర్దుకుంటున్నారు.మంత్రి పదవుల్ని అనుభవించిన వారు, అధికారంలో ఉండగా అప్పటి ప్రతిపక్ష టీడీపీపై నోరు పారేసుకున్న నాయకులు ఎక్కడా చప్పుడు చేయడం లేదు. కేవలం సోషల్ మీడియాలో ముఖాలు లేని ఖాతాలతో పాటు ఆ పార్టీలో మొదటి నుంచి సాగుతున్న వాళ్లు మాత్రమే సోషల్ మీడియాలో కనిపిస్తున్నారు. పార్టీతో ప్రయోజనం పొందిన వాళ్లంతా తమకెందుకు అనవసర వివాదాలని భావిస్తున్నారు.గతంలో వైసీపీ హయంలో సోషల్ మీడియా కోసం పనిచేసిన వారిలో ఎంపిక చేసుకున్న వారిని పార్టీ సొంత ఖర్చులతో ఆన్‌లైన్ ప్రచారానికి వినియోగించు కుంటున్నట్టు తెలుస్తోంది. తక్కువ ఖర్చుతో పార్టీ కార్యక్రమాలను యాక్టివ్‌గా ఉంచడమే లక్ష్యంగా వైసీపీ సోషల్ మీడియా బృందాలు పనిచేస్తున్నాయి.ముఖ్యమైన నాయకులు ఎవరు ఇప్పట్లో సొంత డబ్బులతో పార్టీ కార్యక్రమాలు చేసే పరిస్థితులు లేకపోవడంతో అప్పటి వరకు సోషల్ మీడియా ప్రచారంతో సరిపెట్టుకోవాలని వైసీపీ ఆలోచనగా కనిపిస్తోంది. కనీసం కమ్యూనిస్టు పార్టీల తరహాలో కూడా నిన్న మొన్నటి వరకు అధికారంలో ఉన్న పార్టీ, రాజకీయ కార్యక్రమాలను నిర్వహించలేకపోవడం కూడా లోటుగా కనిపిస్తోంది.

## బీజేపీతో డైరక్ట్ ఫైట్ కు జగన్

విజయవాడ, అక్టోబరు 11, బిజెపి విషయంలో జగన్ కు భ్రమలు తొలగిపోయాయా? బిజెపి తనను అవసరానికి వాడుకుందని గ్రహించారా?మున్ముందు ఆ పార్టీతో ఇబ్బందికర పరిస్థితులు తప్పవని గ్రహించారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.ఇప్పటివరకు బిజెపి విషయంలో జగన్ చాలా రకాలుగా ఆలోచించారు.ఆ పార్టీపై పెద్దగా ఆరోపణలు కూడా చేయలేదు.అయితే ఉన్నట్టుండి ఇప్పుడు బీజేపీని టార్గెట్ చేసుకోవడం విశేషం.జమ్మూ కాశ్మీర్ తో పాటు హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన సంగతి తెలిసిందే.ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తిరగరాస్తు హర్యానాలో బిజెపి అధికారంలోకి వచ్చింది. ముచ్చటగా మూడోసారి పవర్ దక్కించుకుంది. అయితే ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ పార్టీ అనుమానం వ్యక్తం చేసింది.ఉద్యోగుల ఓట్లకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది.ఎప్పుడైతే ఈవీఎంల లెక్క మొదలుపెట్టారో.. అక్కడ నుంచి బిజెపి దూకుడు ప్రారంభమైంది. ఒక్కసారిగా భారతీయ జనతా పార్టీ పుంజుకుంది. చివరకు అధికారానికి అవసరమైన సీట్లను సాధించింది. అయితే ఇక్కడ ఈవీఎంల పనితీరుపై అనుమానాలు ప్రారంభమయ్యాయి. హర్యానాలో బిజెపి ది ప్రజా విజయం కాదని..ఈవీఎంలతో గెలిచారంటూ కాంగ్రెస్ సంచలన ఆరోపణలు చేసింది. జాతీయస్థాయిలో విపక్షాలు సైతం ఇదే అనుమానం వ్యక్తం చేశాయి. అదే అభిప్రాయంతో తాజాగా జగన్ మాట్లాడారు. హర్యానాలో ఎన్నికల ఫలితాలపై అనుమానం ఉన్నట్లు వ్యాఖ్యానించారు. బిజెపి విజయాన్ని తప్పుపట్టారు. కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆకాంక్షించేలా మాట్లాడారుఏపీ ఎన్నికల ఫలితాల సమయంలో సైతం ఈవీఎంల టెంపరింగ్ పై ఆ వైసీపీ నేతలు చాలా రకాల అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ ఒక్కనాడు అంటే ఒక్కనాడు కూడా జగన్ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.ప్రజల ప్రేమ మనవైపే ఉంది.కానీ ఏం జరిగిందో తెలియదు.. ఏం మాయ జరిగిందో తెలియదు.. మనం ఓడిపోయాం అని మాత్రమే అన్నారు. ఈవీఎంలలో అక్రమాలు చేయడం ద్వారా ఎన్డీఏ కూటమి గెలిచింది అని మాట సూటిగా చెప్పడానికి కూడా ఆయన మొహమాట పడ్డారు.అయితే ఇప్పుడు కాలం కరిగే కొద్ది బీజేపీ వైఖరి బయటపడడంతో.. జగన్ సైతం తన అభిప్రాయాన్ని మార్చుకోవాల్సి వచ్చింది.హర్యానా అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వచ్చిన తర్వాత ఈవీఎంలలో అక్రమాలు జరిగాయని అర్థం వచ్చేలా మాట్లాడారు జగన్.ప్రజాస్వామ్యానికి మేలు జరగాలంటే పేపర్ బ్యాలెట్లు ఒకటే మార్గం అని జగన్ తన బలమైన వాదనలు వినిపిస్తున్నారు. దేశవ్యాప్తంగా మోడీ మార్క్ ఎన్నికల నిర్వహణ, వరుస విజయాలపై ప్రతిపక్ష పార్టీలకు అనుమానాలు ఉన్నాయి. ఆ పార్టీలు బాహటంగానే చెప్పుకొస్తున్నాయి. అటువంటి పార్టీల జాబితాలో ఇప్పుడు వైసీపీ చేరబోతోంది. పేపర్ బ్యాలెట్స్ ప్రవేశపెట్టాలన్న డిమాండ్ తో బిజెపికి వ్యతిరేక వర్గంగా మారారు జగన్. అదే సమయంలో విపక్ష కూటమికి దగ్గర అయ్యేలా కనిపిస్తున్నారు.

## భక్తుల మనోరథాన్ని అధిరోహించిన దేవదేవుడు వేడుకగా రథోత్సవం

### భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు

తిరుమల, తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన శుక్రవారం ఉదయం 7 గంటలకు ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు.బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీధులలో విహరింపజేశారు. శ్రీవారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి.తిరుమలలో రథోత్సవం అన్నివిధాలా ప్రసిద్ధమైనది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే" అన్న ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. తిరుమాడ వీధులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు.రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికీ ఉండే సంబంధాన్ని రథరూపకల్పనతో వివరించడం జరిగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుఱ్ఱాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో – స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం.

## సోమశిల సమీపంలో 93 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### రెండు కార్లుతో 5గురు అరెస్ట్

నెల్లూరు,జిల్లా సోమశిల సమీపంలో 93 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని, ఐదుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాలు మేరకు, టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గదర్శకత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. వారి ద్వారా రాబడిన విశ్వసనీయ సమాచారం తో ఆర్ ఐ (ఆపరేషన్స్)కె. సురేష్ కుమార్ రెడ్డి టీమ్స్ లోని ఆర్ ఎస్ ఐలు కె. సురేష్ బాబు, టి.విష్ణు వర్ధన్ కుమార్ బృందం సోమశిల-అనంత సాగరం మార్గం లో ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారిలో నలుగురిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా, ఒకరిని పాండిచ్చేరి వాసులు గా గుర్తించారు. వారి నుంచి 93ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వారిని టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించగా, ఎస్ ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆపరేషన్ లో పాల్గొన్న సిబ్బందికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు. ఇందులో ముఖ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేయడానికి సిద్ధం చేస్తున్నారు.

## విశాఖలో బెంగాలీల దసరా సందడి

విశాఖపట్నం,విశాఖలో ధునిచి నృత్యం తో బెంగా లీలు పూజలు నిర్వహించి ఆహ్లా దభరిత వాతావరణంలో సందడి చేశారు. విశాఖలో ఉంటున్న బెంగా లీలతో పాటు ఇతర రాష్ట్రా నికి వచ్చిన బెంగాలీలు కూడా దస రా వేడుకలు అంగరంగ వైభవంగా జరుపున్నారు. దసరాలో దుర్గమ్మ పూజ అంటే బెంగాలీకు స్పెషల్. ప్రపంచం నలుమూల నుండి ఒకే చోట చేరి కుటుంబం అంతా కలిసి ఈ దసరా పండుగ అమ్మవారు వద్దపూజలు జరుపుకుంటారు. సరదాగా కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. ముఖ్యం గా ఉత్సవాల్లో వారి నృత్యాలు ఈ వేడుకలకు హైలెట్ గా నిలుస్తాయి. దుర్గమ్మ పూజ అంటే బెంగాలీలు ధునిచి నృత్యం అనాదిగా వస్తున్న ఆచారం అని నిర్వాహకులు అంటు న్నారు. సాంప్రదాయం వస్త్రాలు కుర్తాలు చీరలు ధరించి , పురుష లు స్త్రీలు కలిసి డాక్ శబ్దంతో ఈ నృత్యం చేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది.ఈ సారి కూడా ధూమ్ ధామ్ గా వేడుకలు నిర్వ హించి వారి భక్తిని చాటుకున్నారు.

## పురాతన కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలు

విశాఖపట్నం,విశాఖ ఓల్డ్ టౌన్ లో కురుపాం మార్కెట్ ప్రాంతంలో గల 147 సంవత్సరాల పురాతన కన్య కాపరమేశ్వరి అమ్మవారి ఆలయం లో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మ వారిని శ్రీమహాలక్ష్మి రూపంలో అలం కరణ చేసి భక్తులకు దర్శనం కలి గించినట్లు దేవస్థాన పురోహితులు తెలిపారు.తెల్లవారుజామున అమ్మ వారి మూలవిరాట్ కు పాలు, పెరు గు, గంధం, తేనె వంటి 108 రకాల ద్రవ్యములు మరియు వివిధ రకాల పండ్ల రసములతో ప్రత్యేక అభిషే కం చేసి అమ్మవారిని వివిధ రకాల పూలతో సుందరంగా శ్రీమహాలక్ష్మి రూపంలో అలంకరించి స్వర్ణ వస్త్రాలతో అలకరించి , 108 స్వర్ణపుష్పములతో నివేదన గావిం చారు.ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో సుమారు ఆరు కేజీల స్వర్ణభరణములు, బంగారు చీర, బంగారు కిరీటం, బంగారు బిస్కెట్లు మరియు పది కేజీల వెండి వస్తువు లు వెండి బిస్కెట్లు తో పాటు నాలు గు కోట్ల విలువ చేసే భారతీయ కరెన్సీతో తీర్చి దిద్దారు.గర్భగుడి మొత్తం ధనాగారం గా మార్చివేసిన వైనం భక్తులను ఆకట్టుకుంది.గత 22 సంవత్సరముల నుంచి శరన్న వరాత్రి ఉత్సవాల సమయంలో అమ్మవారిని మహాలక్ష్మి అవతార రూపంలో కరెన్సీ నోట్లు, బంగారు మరియు వెండి ఆభరణాలతో అలంకరణ చేయడం జరుగుతుం దని పురోహితులు చెపుతున్నారు.

## నలుగురు బైకు దొంగలు అరెస్టు

పామర్రు,తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్లో జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ప్రెస్ మీట్ నిర్వహించారు. కృష్ణాజిల్లాలో పలుచోట్ల, రాజమండ్రిలో బైక్ దొంగతనాలకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. నలుగురు దొంగలు అరెస్ట్ , రూ. 4 లక్షల రూపాయల విలువచేసే 12 బైకులు స్వాధీనం చేసుకున్నారుఏ. దొంగలు మొవ్వ మండలం చినముత్తేవి గ్రామానికి చెందిన పెంద్రు రాజు, కొక్కిలిగడ్డ చరణ్ తేజ, ఉడుముల అశోక్, శ్రీకాకుళం సాయికుమార్ లు. అందరూ ఒకే గ్రామానికి చెందిన దొంగలు కావటం విశేషం. జిల్లాలో తోట్లవల్లూరు చల్లపల్లి, మోపిదేవి గుడ్లవల్లేరు, కృత్తివెన్ను పెదపారుపూడి, గూడూరు, పెనమలూరు రాజమండ్రి ద్విచక్ర వాహనాలు చోరీ చేసారు. ఊరు చివర ప్రాంతాలు, పంట పొలాల వద్ద రైతులు పెట్టిన వాహనాలే వీరి టార్గెట్. చెడు వ్యసనాలకు బానిసలై ... తమ వ్యసనాలు తీర్చుకోవడానికి ఈజీ మనకి అలవాటు పడి దొంగతనాలకు పాల్పడ్డారు. ఓఎల్ఎక్స్ లో పెట్టి అమ్మకాలు చేసారు. దొంగలపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసినట్టు ఎస్పీ వెల్లడించారు.

### ఇరు వర్గాల ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలు

పామర్రుతోట్లవల్లూరు (మ) రొయ్యూరు ఇసుక క్వారీలో ఎడ్ల బండ్లకు చెందిన ఇరువు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఘటనలో నలుగురికి గాయాలు అయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు వసి కర్రలతో దాడులు చేసుకున్నాయిజ మోర్ల శివ సాయి, అతని బావమరిది పై జస్వంత్, ఈశ్వర్ లు దాడి చేసారు. శివ సాయికి తలపై తీవ్రగాయాలు అయ్యాయి. బాధిలులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు. తలకు తీవ్రగాయాలు కావడంతో శివసాయిని ఆస్పత్రికి పంపించారు. ఐలూరు, కళ్ళం వారి పాలెం, చాగంటిపాడు, భద్రిరాజుపాలెం రాత్రి సమయాల్లో వందలాది ఎడ్లబండ్లతో యదేచ్చగా ఇసుక తోలకాలు జరుగుతున్నాయి. ఎడ్ల బండ్లతో తోలి డంపు చేసి ట్రాక్టర్లకు ఎగుమతి చేస్తారు.

## ఏపీఎస్ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆయుధ పూజ..






విభారె న్యూస్ అక్టోబర్ 11 కర్నూలు జిల్లా ప్రతినిధి..స్థానిక ఎమ్మిగనూరు ఏపీఎస్ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఆయుధపూజ నిర్వహించారు.ఆయుధ పూజ అనేది వ్యవసాయ ఉపకరణాలు యంత్రాలు వాహనాలు కంప్యూటర్లు వంటి ప్రజల జీవితంలో అంతర్భాగమైన పరికరాలు సాధనలను పూజించటానికి అంకితం చేయబడిన రోజు ఈ రోజున ప్రజలు తమ పనిముట్లను శుభ్రం చేసి అలంకరిస్తారు వారి శ్రేయస్సు వారి పనిలో విజయం కోసం దైవిక ఆశీర్వాదాలు కోరుతూ వాటికి పూజ చేస్తారు ఈరోజు అమ్మవారు మహిషాసురుడిని అంతం చేసి మహిషాసుర మర్దిని గా నామాన్ని స్థిరం చేసుకుంది. దుష్ట శిక్షణ శిక్ష రక్షణ చేసి శాంతి స్వరూపిణి ఆ అమ్మవారిని ఎమ్మిగనూరు ఏపీఎస్ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులంతా పూజలు చేసి అమ్మవారిని కొలిచారు. తమ డిపోలో ఎటువంటి దుష్టశక్తి రాకుండా ఉండుటకు ఎమ్మిగనూరు డిపో బస్సులు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలని డిపో అభివృద్ధి చెంది లాభాల బాటలో రావాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగన్న, మహేశ్వర్ రెడ్డి, కే.కే., ప్రసాద్, శరణప్ప, ఎం ఎల్ రెడ్డి, సురేష్ బాబు, బజార్ అప్ప,నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి ముస్తాక్ అహ్మద్,సహాయ కార్యదర్శి మదార్ సబ్, ముస్లిం మైనారిటీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి పీఎం భాషా, షఫీ ఉల్లా,ఎలక్ట్రీషన్ ఉస్మాన్,శారద, భారతమ్మ పాల్గొన్నారు.

## ఆడపిల్లలకు బతుకునిద్దాం!

### - కర్నూలు జిల్లా బాలుల హక్కుల కన్వీనర్..



విభారె న్యూస్ అక్టోబర్ 11 ఎమ్మిగనూరు..ఆడపిల్ల అది వారశక్తి అందుకే బతుకు నిద్దం చదివిద్దాం ఎదగనిద్దాం అని కర్నూలు జిల్లా బాలహక్కుల పరిరక్షణ వేదిక డిస్టిక్ కన్వీనర్ అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఆడపిల్ల అవినీతి వెలుగని అమ్మాయిలు చదువు భవిష్యత్తుకు వెలుగని అందుకే ప్రతి సంవత్సరం అమ్మాయిలు చదువుకొ నుటకు జిల్లా ఉన్నత అధికారుల సహకారంతో జిల్లాల్లో ఆయా మండలాలలో కొన్ని వందల మందికి పైగా చేర్పించానని కన్వీనర్ పేర్కొన్నారు మహిళగా రూపొంది కీలక దశ కౌమార్దశ వర్తమానంలోనే కాదు భవిష్యత్తులోనూ సాధికారితా దిశలో నడిపించడానికి అవగాహన అవసరం ఆడపిల్ల అంటే ఆట బొమ్మ కాదు అద్వితీయ శక్తి అన్నాడో మహా రచయిత ఆడపిల్లల చదువుకి దూరం అయ్యే కొద్దీ ప్రపంచం పేదరికనికి దగ్గర అవుతూనే ఉంటుందని వన్ క్యాంపెన్ అధ్యక్షుడు గేల్స్మిత్ అభిప్రాయాన్ని కన్వీనర్ గుర్తు చేశారు ఏది ఏమైనా మనమందరం బాలికలకు రక్షణగా నిలవాలని అదేవిధంగా బాలిక రక్షణ కోసం ఉన్న చట్టాలను పక్కగా అమలు చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో బాలుల హక్కుల కమిషన్ ద్వారా అవగాహన కార్యక్రమంలో నిర్వహిస్తున్నాం జిల్లాలో కొన్ని ల్యాబ్ లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నా రని ఫిర్యాదులు ఉన్నాయి ఇలాంటి వాటిపైఅధికారులు జిల్లా అధికారులు దృష్టి సాధించాలని కర్నూలు జిల్లా సిఆర్పిఎఫ్ కన్వీనర్ మీడియా ముఖంగా తెలిపారు.

## కర్నూలు జిల్లా ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు.. - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి మురళీకృష్ణ..

విభారె న్యూస్ అక్టోబర్ 11 కర్నూలు జిల్లా ప్రతినిధి..జిల్లా ప్రజలకు,కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ అభిమానులకు మాజీ ఎమ్మెల్యే,టీటీడీ బోర్డు పాలకమండలి మాజీ సభ్యులు,కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పి మురళీకృష్ణ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. హిందువులకు దసరా పండుగ ముఖ్యమైన పండుగ అని భక్తులు దుర్గామాతకు తొమ్మిది రోజులు (నవరాత్రులు) పూజలతో ఎంతో భక్తి శ్రద్ధలతో నియమనిష్టలతో పూజలు చేసి పదో రోజు విజయదశమి పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకొని దుర్గామాత కృపకు పాత్రులు కాగలరని పి మురళీకృష్ణ ఆకాంక్షించారు.



# పోలీసు హెడ్ క్వార్టర్స్ లో ఆయుధ పూజ...

## - జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్.




విభారె న్యూస్ అక్టోబర్ 11 కర్నూలు జిల్లా ప్రతినిధి..జిల్లా ప్రజలందరికీ, పోలీసు అధికారులు , సిబ్బందికి విజయ దశమి శుభాకాంక్షలు తెల్పిన జిల్లా ఎస్పీ.దుర్గా దేవికి,పోలీసులు వినియోగించే అన్ని రకాల తుపాకులకు,వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా ఎస్పీ దంపతులు.జిల్లా ప్రజలకు,పోలీసు అధికారులు ,సిబ్బందికి కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ శుక్రవారం విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంధర్బంగా ప్రతీ ఏటా ఆనవాయితీ గా చేపట్టే ఆయుధ పూజ ను జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎస్పీ దంపతులు నిర్వహించారు.పోలీసు ఆయుధగారంలో పోలీసులు వినియోగించే ప్రతీ ఆయుధాన్ని అలంకరించారు.దుర్గాదేవి చిత్రపటానికి, జమ్మిచెట్టుకు,పోలీసు వాహనాలకు పూజలు చేశారు.విజయాలకు చిహ్నమైన ఈ విజయదశమి అన్ని రంగాల్లో అందరికి విజయం చేకూర్చాలని, సుఖ సంతోషాలతో ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపీఎస్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ కుమార్,కర్నూల్ డిఎస్పి జె.బాబు ప్రసాద్,ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, ఆర్ ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, జావేద్,పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు,ఆర్ ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డెంగ్యూ, మలేరియా,తో జాగ్రత్తలు

### హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 11-డెంగ్యూ. మలేరియా. టైఫాయిడ్ ను రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే అరికట్ట వచ్చునని ఆయన అన్నారు. ఇంటి పరిసరాలలో నీరు ఉండకూడదన్నారు. నీటి నిల్వలోనే దోమలు పుడతాయని అన్నారు - వాటితోనే రోగాలు వస్తున్నా యని చెప్పారు. దోమలను నివారిద్దాం ఆరోగ్యాన్ని పెంచుకుందాం అని అన్నారు. కాచి వడపోసిన నీరు, వేడి వేడి ఆహారం ఆరోగ్యానికి అవసరం. బయటి ఆహారం విషంలాంటిదన్నారు. ఇంటిలో ఆహారం అమృతంలాం టిదన్నారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు మరియు తీవ్రమైన వ్యాధులు వున్న వారు అత్యంత జాగ్రత్తగా వుండాలని సూచించారు. అవసరం అయితే ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలి. జ్వర లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం వద్దు, దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రి సంప్రదించాలని కోరారు .

# జిల్లా పోలీసు కార్యలయంలో ఘనంగా ఆయుద పూజా.... జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 11-నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆద్వర్యంలో ఘనంగా ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యలయం నందు గల అర్మ్మడు రిజర్వ్ విభాగం ఆయుధాగారం నందు దుర్గామాతకు అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా పోలీసులు సుఖఃశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేక పూజలు చేశారు. ఆనవాయితీ ప్రకారం పోలీసు ఆయుధాగారంలోని పోలీసులు దైనందిన విధుల్లో వినియోగించే అన్నిరకాల ఆయుధాలకు మరియు మోటారు ట్రాన్సుపోర్ట్ విభాగంలోని వివిధ రకాల వాహనాలకు ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకూడదంటూ ప్రార్థిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడారు ముందుగా జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తు దుర్గా మాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు, జిల్లా అండ్ రాష్ట్ర పోలీసులు సంతోషంగా జీవించాలని,జిల్లా పోలీసులకు తమ దైనందిన విధులు, సేవల్లో విజయాలు చేకూరాలని , ఆయు:రారోగ్యాలతో ప్రజలతో మమేకమై పోలీసుశాఖ ప్రతిష్ట పెంపొందేలా పోలీసు విధులు ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ .యుగంధర్ బాబు , నంద్యాల సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, జిల్లా సాయుధ పోలీస్ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# రత్నమైన పారిశ్రామిక, సామాజిక విప్లవకారుడికి - టాటా- వేదాస్ స్వచ్ఛంద సేవ సంస్థ...

విభారె న్యూస్ ఎమ్మిగనూరు అక్టోబర్ 11..వయసు తేడా లేని స్నేహశీలత్వంమూగబోయింది. కార్పొరేట్ సేవా రంగం ఒక పితామహుణ్ణి కోల్పోయింది. కట్టె కాలేదాకా నిలువెత్తు నిండిన మన భారత రత్నమైన రతనుడి రాట్నం ఆగిపోయింది.గత రెండున్నర దశాబ్దాలకి పైగా సేవే మార్గంగా వేదాస్ స్వచ్ఛంద సంస్థలు అనేక రాష్ట్రాల్లో నిరాడంబరంగా చేస్తున్న సేవల్లో భాగంగా వేదాస్ డైరెక్టరు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో, ఎమ్మిగనూరు పట్టణంలోని సోమప్ప సర్కిల్లో రతన్ టాటాకు ఘనంగా నివాళులు అర్పించారు. వక్తలందరూ మాట్లాడుతూ టాటా తన సంపాదనలో 67 శాతం సమాజానికి ఉచితంగా ఇచ్చిన మానవ సుద్రూపి అని కొనియాడారు.అలాగే కార్పొరేట్ సామాజిక రంగం ఒక విప్లవ పితామహుడిని కోల్పోయిందని అభిప్రాయపడ్డారు. పేదవాడి కలగా వున్నకారును కేవలం లక్ష రూపాయల్లోనే నానో కారుగా తెచ్చిన ఘనత కేవలం ఒక్క టాటాకు మాత్రమే దక్కిందన్నారు.అన్ని కార్పొరేట్ సంస్థలు ఇలాగే సామాజిక సేవను ఒక భాద్యతగా భావిస్తే పేదరికం లేని సమాజాన్ని చూడొచ్చని రతన్ టాటా సేవలను నెమరువేసుకున్నారు. మాజీ శాప్ నెట్ ఛైర్మెన్ మాచాని వెంకటేష్,ఎంపీపీ కేశన్న,ప్రియా స్వచ్ఛంద సంస్థ ఛైర్మెన్ షఫీఉల్లా,హై కోర్ట్ అడ్వకేట్ కాకర్ల చంద్ర శేఖర్,ఎల్ ఐ సి అసోసియేషన్ ప్రెసిడెంట్,వేదాస్ అధ్యక్షులు ఎస్ ప్రభాకర్, సోమేశ్,సినిమా డిస్ట్రిబ్యూటర్ భరత్ సాగర్,సందీప్ కుమార్,నజీర్ తదితరులు ఘనంగా రతన్ టాటాకు నివాళులు అర్పించారు.




## కాళికామాతగా దర్శనమిచ్చిన సుంకులమ్మ..



విభారె న్యూస్ అక్టోబర్ 11 ఎమ్మిగనూరు..దేవి శరన్నవ రాత్రుల్లో భాగంగా తొమ్మిదవ రోజు అయిన శుక్రవారం రోజు మహర్నవమి సందర్భంగా కాళికామాత అలంకరణలో సుంకులమ్మ భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకోవ డానికి భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులైనారు. ఉదయాన్నే అమ్మవారికి ఆలయ పూజారి నాగరాజు దంపతులచే అమ్మవారికి పంజామృతాభిషేకం, అర్చన, ఆకు పూజ, నిమ్మకాయల మాల, పూల అలంకరణ తదితర అలంకరణలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి కాళికామాత అలంకరణను ఉష, కార్తీక, సుగుణలచే అలంకరణ గావించబడినది. పూజ అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ గావించడం జరిగినది.

## ఈనెల 14న హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో సర్వసభ్య సమావేశం...

విభారె న్యూస్అక్టోబర్11ఎమ్మిగనూరు.14వ తేది సోమవారం సాయంత్రం 5 గంటలకు అయ్యప్ప స్వామి దేవాలయం నందు అన్నదాన కమిటీ,ఆలయ కమిటీ గురించి,దేవాలయ అభివృద్ధి కొరకు సమావేశం ఏర్పాటు చేయడమైనది తప్పకుండాగురు స్వాములు స్వాములు అందరూ తప్పకుండా రావాల్సిందిగా ఆలయ కమిటీ వారు కోరారు.

## మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చిన గాయత్రీ దేవి..




విభారె న్యూస్ అక్టోబర్ 11 ఎమ్మిగనూరు. స్థానిక గీతా నగర్ లో వెలసిన వేద బ్రాహ్మణ గాయత్రి దేవాలయంలో గాయత్రీ దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని 9వ రోజు శుక్రవారం మహార్నవమి సందర్భంగా గాయత్రీ దేవిని మహిషాసుర మర్దిని అలంకరణ గావించారు. మహార్నవమి పురస్కరించుకొని దేవాలయంలోని చండీ హోమం నిర్వహించి హోమము అనంతరము పూర్ణాహుతిని గావించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయినారు. ఈ పూజా కార్యక్రమాలు అన్నియు ఆలయ అర్చకులు బలకుంది నరసింహ శాస్త్రి చే నిర్వహించబడినవి.

## శ్రీ రాజరాజేశ్వరి దేవిగా కాళికామాత ...

విభారె న్యూస్ అక్టోబర్ 11 ఆళ్లగడ్డ మా ప్రతినిధి :- ఆళ్లగడ్డ విశ్వరూప నగర్ శ్రీ శ్రీ శ్రీ కాళికామాత దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి దురగడ్డ రవీంద్ర చారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు దురగడ్డ అనురాధ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తొమ్మిదవ రోజు శుక్రవారం శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో కాళికామాత అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతం అభిషేకము అనంతరం ప్రధాన అర్చకులు చంద్రశేఖర ఆచారి అమ్మవారి ని పట్టు వస్త్రాలు, ఆభరణాలు వివిధ రకాల పుష్పాల చేత రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఎన్ వి లక్ష్మీదేవి (కీ.శే అన్నయ చారి భార్య) ఎన్ వి వీరబ్రహ్మేంద్ర ఆచారి (శిల్పి) ఎన్ వి ఆర్ నరసింహచారి, మరియు దురగడ్డ బద్రి నారాయణ ఆచారి ధర్మపత్ని దురగడ్డ విజయలక్ష్మి ఉభయ దారులుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**